# చామంతి

శ్రీరామనవమి ఉత్సవాలు వస్తే ఆ ఊర్లో ఎక్కడలేని సందడి. పదిహేను రోజులు సంబరంగా జరిగే ఉత్సవాలలో రెండేళ్ళుగా మరింత సంచలనం కలిగించింది, ఒక కన్నెపిల్ల "నాదస్వర కచేరి."

ఆ అమ్మాయి పేరు చామంతి!

చామంతిలా పచ్చని దేహచ్ఛాయతో, మిసమిస మెరుస్తూ, పెద్ద పెద్ద కళ్ళతో సజీవ శిల్పంలా వుంటుంది ఆ అమ్మాయి. చామంతి వాళ్ళ నాన్న, తమ్ముడు, ఆమె అక్క భర్త పక్క వాద్యగాళ్ళు.

నవరసాలు విరజిమ్ముతూ, శ్రోతలను ఉర్రూతలూగించే వారి 'నాదస్వర కచేరి' ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ!

మైసూరు శ్రీగంధం బొమ్మలా తీర్చి దిద్ది నట్టుండే కన్య చామంతి నాజూకైన వేళ్ళు సన్నాయిపై నాట్యం చేస్తూంటే—ముగ్ధులుకాని మనుషులు లేరు

*　　*　　*　　*

ఆ సంవత్సరం రామ ఉత్సవాలకు కాస్త ముందుగానే వెళ్ళి, వారి కచ్చేరీని ఏర్పాటు చేసుకొచ్చారు ఊరి పెద్దలు—

"ప్రతిసారీ ఊరించి, ఊరించి తప్పించుకుంటుంది. ఈసారి చామంతిని ఓ పట్టు పట్టాల్సిందేరా!"

"తప్పదియ్యా! దానికాపేరు ఎట్టా పెట్టాడో కాని దానయ్య-నిజంగా చామంతి, చామంతి పువ్వులా నిగనిగలాడేస్తుంది—"

"—అయినా పెళ్ళికానిపిల్ల అలా సన్నాయి వాయిస్తూ మగాళ్ళ మధ్యకు వచ్చిందీ అంటే ....హీ ...హీ....హీ.... ఇంకా అర్థంకాలా?"

"ఊరూరి జనం యీ వుత్సవాలకు మరీ- యీ రెండేళ్ళలో-ఎక్కువగా వస్తున్నారంటే ఎందుకు వస్తున్నట్టు? అసలు ఆ పిల్లను చూట్టానికేగా?"—

"ఎన్నిసార్లు వచ్చినా అసలాపిల్ల ఎవరితోనయినా పెదవి విప్పి మాట్లాడటం మీరు చూశారా?"—

"మాటలు రావేమో?"

"మూగదేమో?"

ఇలా ఇలా చామంతిని గురించి, ఆమె అందచందాలను గురించి అనేక ఊహలు, అనేక వూసులు ఆ ఊరి ప్రజల్లో - వుత్సవాలు దగ్గరపడేకొద్దీను.

"ఆమె సన్నాయిలో పలికించే స్వరాలు మన పాలిటి వరాలు"-అన్నవాడు చదువుకుని, ఆ ఊర్లో మాస్టారీ ఉద్యోగం చేస్తున్న సంస్కారి గోపు.

గోపయ్య పిచ్చివాడు అన్నట్టు అందరూ అతని వైపు విచిత్రంగా చూశారు. ఊరివారి ధోరణి గోపుకు పూర్తిగా నచ్చలేదు.

ఈ మనుషుల్లో మలినభావాలు మాసిపోయి, మానవతా మంగళ వాద్యాలు మార్మోగేదెప్పుడో?- అదీ అతని ఆలోచన. ఈ సంవత్సరం ఏదో ఒక వంకతో చామంతి వాళ్ళు ఈ ఊరు రాకపోతే బావుణ్ణు- అని పదే పదే అనుకోసాగాడు. అయితే ఊరి పెద్దలకిచ్చిన మాట ప్రకారం "చామంతి" వాళ్ళ బృందం ఉత్సవాలకు రానే వచ్చారు.

* * *

శ్రీరాముడి కళ్యాణం, పట్టాభిషేకం జరిగాయి—

ఏరోజుకారోజు 'చామంతికి' ఏం జరుగుతుందోనని అంటి పెట్టుకునే తిరగసాగాడు గోపు. కానీ, తను అనుకున్నట్టు, ఊళ్ళోవాళ్ళు చర్చించు కున్నట్టు ఏమీ జరక్కపోవడం ఆశ్చర్యాన్నే కలిగించింది.

ఉత్సవాలకు పూజారిగా గోపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

చామంతి నాగస్వరాన్ని లీనమై వింటున్నాడు కచేరీ చేసేటప్పుడు ఆమె పద్మాసనం వేసుకుంటుంది. నాజూకయిన కనుబొమ్మల మధ్య తిలకంతోపాటు దిగువ గుండ్రంగా గంధం దిద్దుకుంటుంది లేత పెదవులతో సన్నాయిని ప్రేమగా పట్టుకుంటుంది. స్వరాలకు ఊపిరి పోస్తూ, అందమైన రెండు బాహువులతో సన్నాయిని ఎత్తి పట్టుకుని, సరిగమలు పలికిస్తూవుంటే, ఆరోహణావరోహణల్లో అమృతం చిలికిస్తూవుంటే— దివి నుండి భువికి దిగివచ్చి, సంగీత తపస్సు చేస్తున్న గంధర్వకన్య సాక్షాత్కరించింది గోపూ మనో నేత్రానికి!

గోపు బ్రహ్మచారి. కఠోరమైన నియమ నిష్ఠలు కలవాడు. వైదిక భావాలు జీర్ణించుకున్నవాడు. సంగీతం, సాహిత్యం అంటే ప్రాణం ఇచ్చేవాడు. అందుకే ఆమె గానామృతాన్ని అనిమిషుడై ఆస్వాదిస్తున్నాడు.

ఎవ్వరితోనూ మాట్లాడేది కాదు చామంతి.

"నీకు మాటలు రావా?" అని ఎవరో అడిగితే- అప్పుడే ప్రపంచాన్ని చూసిన పువ్వులా- చిరునవ్వు నవ్వి వూరుకుంది.

మాటలెందుకు? ఆమె విశాల నేత్రాలు విప్పితే ఎన్ని కావ్యాలు?? భాషకందని ఎన్ని భావాలు?? కళ్ళల్లో ఎంత తేజస్సు సజీవంగా బహిర్గతమవుతూ వుంటుంది??—

ఆమె ప్రతి చర్యనూ గమనిస్తున్నాడు గోపు.

ఆమె మాత్రం నాదవేదంలో ఉన్మీలనమై వుంటుంది- బంగారూ ప్రతిమలా.

* * *

ఆ రోజు—

స్వామివారి వసంతోత్సవం!

దేవుడి ఊరేగింపు వుంటుంది, మధ్యాహ్నం పైన.

ఊరు ఊరంతా వసంతాలు పోసుకుంటారు. వరసైన వారిని ఒక్కర్నీ వదలరు. వళ్ళంతా తడిపే వరకు. అదో తంతు, అదో వింత!!

ఉత్సవంలో కూడా కచ్చేరి మేళం వుండవలసిందే! అయితే గడచిన రెండు సంవత్సరాలు దేవుని వూరేగింపుతో చామంతి వెళ్ళలేదు వాళ్ళ బావ' నాన్న, తమ్ముడు వెళ్ళొచ్చేవారు. చామంతి దేవుడు తిరిగి వచ్చే వరకు దేవాలయంలోనే కొంతమంది స్త్రీలతో వుండేది.

ఈ మారు "చామంతి" కూడా రావాలని పట్టుబట్టారు ఊరి యువజన సంఘం సభ్యులు. చామంతి నాన్న వాళ్ళకు ఎంత చెప్పినా వినలేదు. చివరకు ఆ ఊరి పెద్దల జోక్యంతో ఒప్పుకోక తప్పలేదు

వసంతోత్సవం మొదలయింది. రంగు రంగుల నీళ్ళు చిమ్ముతూ, ఉత్సాహంగా వుంది సంబరం.

ఊరేగుతున్న దేవునికి అడుగడుగునా భక్తులు అందిస్తున్న నైవేద్యాలు స్వీకరించి, కొబ్బరికాయలు కొట్టి, కర్పూరం వెలిగించి, దేవునికి హారతు లిచ్చి తిరిగి ఎవరెవరి పళ్ళాలు వారికి అందిస్తున్నాడు గోపు.

చామంతి ఇలా ఊరేగింపులో ఈ గుంపుతో రావడం గోపుకు ఇష్టం లేదు. అయినా మౌనం వహించక తప్పలేదు. చామంతిని సినిమాల్లో బూతు పాటలను సన్నాయిలో అలపించమని ఆదేశిస్తున్నారు కొందరు. అందుకామె ససేమిరా అంగీకరించలేదు దాంతో రెచ్చిపోయిన ఆ యువకుల బృందం, ఊరేగింపు నడివీధిలోకి రాగానే- బక్కెట్లతో వసంతాలు నింపు కొనివచ్చి- చామంతిపై పోసి, నిలువెల్లా తడిపేశారు.

పూర్తిగా తడిసిపోయిన చామంతి ఒంటికి గుడ్డలు అతుక్కుపోయి, ఆమెలోని నవ యౌవ్వన పొంగులను స్పష్టంగా బహిర్గతం చేయసాగాయి.

అభిషేకం వేయించుకున్న దేవతా విగ్రహంలా-నిశ్చేష్ట అయింది చామంతి!

ప్రతి ఒక్కరూ ఆమెనూ, ఆమె సౌందర్యాన్నీ గుచ్చిగుచ్చి చూడసాగారు మగాళ్ళందరూ దేవుణ్ణి వదిలి, ఆమె చుట్టూ చేరారు. పాపం! బిక్కముఖం వేసిన దేవుడు "వీళ్ళ భక్తి యింతేనా?" అని వెలవెలబోయాడు!

యువకులు పిచ్చిగా అరుస్తూ, ఈలలు కొడుతూ, తాగి తూగుతూ, ఆనందంగా చిందులు వేయసాగారు. వారిలో ఒకడు ఉద్రేకంగా ముందుకు వచ్చి, ఆమె పవిటను లాగివేశాడు.

నవ్వులు.... ఈలలు.... చిందులు దేవుడు ఊరేగుతున్న వాహన శిఖరాగ్రాన కాంతుల్ని విరజిమ్ముతున్న మంగళ కలశాల్ని, ఆమె వక్ష భాగాన దర్శిస్తున్న ఆ ఊరి పెద్దలు గుటకలు వేయసాగారు.

సన్నాయిని వదిలేసి, రెండు చేతులతో వక్షాన్ని కప్పుకుని, సిగ్గుతో ముకుళించుకు పోయింది చామంతి.

చామంతి నాన్న, తమ్ముడు, బావ వాయిద్యాలు ఆపి, ఈ హఠాత్సం ఘటనకు స్థాణువులయ్యారు.

అనుకోకుండా జరిగిన ఆ సంఘటనకు కలవరపడి, తేరుకుని, ఉగ్రుడైన గోపు, "ఆగండి!" అంటూ ఒక్క కేక వేశాడు.

చిందులు ఆగిపొయ్యాయ్, ఆగొంతులోని దృఢత్వానికి, ఉద్రిక్తతకు! "దేవుణ్ణి దింపండి" అంటూ బలవంతంగా దేవుణ్ణి మోస్తున్న వాహనాన్ని క్రిందికి దింపించాడు గోపు వీరావేశంతో. 'అపచారం, అపచారం' అంటూ అందరూ, 'దేవుణ్ణి అలా దింపకూడదు పూరేగింపు పూర్తయ్యేవరకూ' అని గొణగసాగారు.

"నడివీధిలో ఒక అమ్మాయిని అగౌరవపరిచి, అవమానించడం అపచారం, అదంతా చూస్తూ పైన ఊరేగుతున్న ఆదేవుడు దేవుడూ కాదు. భక్తి భావాన్నీ, పవిత్ర ధర్మాన్నీ విస్మరించి, పశువుల్లా-ప్రవర్తించే మీరు మనుషులూ కారు ఈ ఊరేగింపు యిక ముందుకు సాగనివ్వను. చామంతికి మీరు క్షమాపణ చెప్పుకునేవరకు, ఒక్క అడుగు కూడా కదల నివ్వను" అంటూ అప్పటివరకూ కొబ్బరికాయలు కొట్టేందుకు వుపయోగిస్తున్న చేతిలోని ఇనుపరాడ్‌ను పైకెత్తి, తిరగబడ్డాడు గోపు.

పవిట సర్దుకుని, నన్నాయినందుకున్న చామంతి మొదటిసారిగా గోపును స్పష్టంగా చూసింది. వెన్నంటి వస్తున్న వారంతా వెన్నుపోటు పొడవడంతో, ఒంటరిగా పోరాడుతున్న మహాహరుడు అతనిలో దర్శన మిచ్చాడు. అంతమందిలో అతనొక్కడే "మనిషి" అనిపించింది. ప్రచండ మార్తాండునిలా వెలిగిపోతున్నాడు.

జనం అంతా ఒక్క అడుగు వెనక్కువేసి అంతలో ధైర్యం తెచ్చు కుని, ముందుకు వచ్చి "చూడు గోపయ్యా! చదువుకున్నోడివి. సొంతూర్లో వుద్యోగం చేస్తున్నోడివి- నీకెందుకు చెప్పు? ఆ తర్వాత ఫలితం అను భవించవలసిన వాడివి నువ్వేగా?? మర్యాదగా తప్పుకో!!" అని హెచ్చరించారు.

"అవమానం కంటే ప్రాణం ఎక్కువ కాదు నా దృష్టిలో, మీరు ఆమెకు క్షమాపణ కోరాల్సిందే!" నిక్కచ్చిగా చెప్పాడు గోపు.

నోట్లో మాటలు నోట్లో వుండగానే గోపుమీద పపవుల్లా పడ్డారు ఆ గుంపు వెదురు కర్రలు గాలిలో కదం తొక్కాయి.

వసంతం నీళ్ళరంగు, రక్తం కలిసి గోపు శరీరాన్ని తడిపేశాయి ఓ క్షణంలో. అతని చిక్కటి, వెచ్చని రక్తం చివ్వున చిమ్మి, చామంతి ముఖాన్ని స్పర్శించింది.

తపస్సు భగ్నమైన ముని కన్యలా చామంతి అరిచింది ఈ మారు, ఆగమని!

గుడిలోని అమ్మవారి విగ్రహం ఆగ్రహించి పలికినట్టు- చకితులై అందరూ అటు తిరిగారు

"అర్ యు మ్యాడ్? వాట్ అర్ యు డూయింగ్ హియర్-నాన్ సెన్స్? అర్ యు నాట్ హ్యూమన్ బీయింగ్స్? బీస్ట్స్!!—అహింసను ప్రవచించిన బాపూజీ, ఆత్మావిష్కరణను ప్రబోధించిన గౌతమ బుద్ధుడూ పుట్టిన దేశంలోనేనా మనం వుంటున్నది? సాటి మనిషి పట్ల ఎలా ప్రవర్తించాలో కూడా మీకు తెలీదా? మీరు మాకు ఇస్తానన్న డబ్బు మాకక్కరలేదు మనుషులకు మానవత్వం ప్రధానం. అది లేనిది మృగాలకు. నేను మీ మీద కేసు పెడుతున్నాను. మీరు మనుషులో, మృగాలో అక్కడే తేల్చుకోండి" అని ఆవేశంగా ముందుకొచ్చి తండ్రినీ, ఏడుస్తున్న తమ్ముడిన్నీ, బావనూ కలుసుకుంది చామంతి.

బావ సాయంతో గోపు తలకు కట్టు కట్టించింది, అతని వృద్ధ తల్లికి అప్పగించింది.

కృతజ్ఞతలు తెలుపుకుంది.

ఖిన్నులయ్యారు ఊళ్ళో వాళ్ళు.

ఆ ఊరి మీదుగా టౌనుకెళ్ళే లాస్ట్ ట్రయిన్ స్టేషన్లో ఆగి వుంది.

చామంతీ వాళ్ళు ఎక్కారు.

ఊరేగింపు ఆగిపోయింది.

సంబరం సద్దు మణిగింది

ఊళ్లోవాళ్ళు కొత్త ఎత్తుల కోసం వెతుకుతున్నారు!

మరో నిముషంలో బండి బయలుదేర బోతుందనగా తలపై కట్టుతో పరుగెత్తుకొచ్చాడు గోపు—

కిటికీ దగ్గర కూర్చొని వున్న "చామంతి" దగ్గరికెళ్ళాడు, చేతిలో సన్నాయిని నాప్కిన్‌తో శుభ్రంగా తుడుస్తూ వుంది.

"చామంతీ!"

ఆ పిలుపుకు చిత్రంగా తలతిప్పి, చూసింది.

గోపు?

"క్షమిస్తారు కదూ?" అన్నాడు ఆర్ద్రంగా.

ఆమె కళ్ళు రెపరెపలాడాయి.

"ఎందుకూ?"

ట్రయిన్ కూతలో ఆమె ఏం అన్నదో వినిపించలేదు.

ఆ పక్కనే కూర్చొని వున్న వాళ్ళ నాన్న, బావ, తమ్ముడు- గోపు వంక ప్రేమగా చూస్తున్నారు.

కిటికీ అవల చామంతి, ఈవల ప్లాట్ ఫాం మీద గోపు.

"మీకు ఏ రకంగానూ సహాయపడలేక పోయాను. ఈ ఊర్లో పుట్టినందుకు సిగ్గుపడుతున్నాను" అన్నాడు గోపు.

"నావల్ల మీకు కష్టాలు" చామంతి గొంతు ఆర్ద్రమయింది.

"లేదు."

"నాకోసం మీరెందుకలా చేశారు?"

"మానవత్వం అంటే నాకిష్టం."

గార్డ్ విజిల్ ఊదటంతో ట్రయిన్ కదిలింది.

చామంతి గోపువంక చూసింది.

ఆ కళ్ళలో ప్రేమ వెన్నెల విరిసింది.

★